మంటెత్తిస్తున్న మిరప విత్తనం ధరలు

- డిమాండ్ ఉన్న విత్తనాలకు కృతిమ కొరత సృష్టి..
- విత్తనం ధర అమాంతం పెంపు
- గ్రామాల్లో దళారీల ద్వారా అమ్మకాలు
- కొరవడిన వ్యవసాయాధికారుల తనిఖీలు


మిరప విత్తనాలు

వత్సవాయి: మిరప విత్తనాల ధరలు రైతులకు మంటెత్తిస్తున్నాయి. వాణిజ్య పంటల్లో ప్రధానమైన మిర్చి సాగు చేపట్టేందుకు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. అందులోభాగంగా మార్కెట్లో మంచి విత్తనాన్ని కొనుగోలుకు యత్నిస్తున్నారు. దీంతో కొందరు వ్యక్తులు మిర్చి విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి రైతుల జేబులను గుల్ల చేస్తుండటం గమనార్హం.

ఈ ఏడాది తగ్గనున్న విస్తీర్ణం..

గత ఖరీఫ్ సీజన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో కలిపి మొత్తం 13,750 ఎకరాలలో మిరప పంటను సాగుచేశారు. అయితే ఈ ఏడాది పదివేల ఎకరాల్లో మిర్చి సాగు చేపట్టే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడమే సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణమని రైతులు చెబుతున్నారు.

అదనపు వసూళ్లు...

నియోజకవర్గంలో మిర్చిసాగును దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు విత్తనాల ధరలను అమాంతం పెంచారు. అసలు ధరకంటే 10 నుంచి 20శాతం అదనంగా రైతుల వద్ద నుండి వసూలు చేస్తున్నారు. అధిక ధరల విషయంపై రైతులు ప్రశ్నిస్తే కృతిమ కొరత సృష్టించి విత్తనాల డిమాండ్‌ను మరింత పెంచేస్తున్నారు. దీంతో రైతులు తొందరపడి అధిక ధరను వెచ్చించి మరీ కొనుగోలు చేయక తప్పడం లేదు. ఇలా వ్యాపారులు, దళారులు కలిసి మిర్చి విత్తనం ధరలు ఇష్టారాజ్యంగా పెంచుతున్నప్పటికీ కట్టడి చేయాల్సిన వ్యవసాయాధికారులు మాత్రం విత్తనాల షాపుల వైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

కానరాని స్టాక్ బోర్డులు...

జగ్గయ్యపేట నియోజకవర్గంలో అనుమతులు ఉన్న విత్తనాల షాపులు కొన్నిమాత్రమే ఉంటే వాటి కంటే అదనంగా లైసెన్స్ లేకుండా అమ్మకాలు సాగించే షాపులు అధికసంఖ్యలో ఉన్నాయి. కొన్ని కంపెనీలకు చెందిన ప్రతినిధులు కొన్ని గ్రామాలలో కొంత మంది రైతులను ఎంపిక చేసుకుని వారి ద్వారా మిగిలిన రైతులకు మిర్చి విత్తనాలను విక్రయిస్తున్నారు.

విత్తనం కొనుగోలు చేసిన రైతులకు కనీసం రశీదులు కూడా ఇవ్వడంలేదు. అనుమతులు ఉన్న డీలర్లు షాపుల ఎదుట స్టాక్‌బోర్డులు కూడా పెట్టడం లేదు. వ్యవసాయాధికారులు కూడా తనిఖీల పేరుతో హడావుడి చేయడం మినహా, స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయని వ్యాపారులపై చర్యలు తీసుకోకపోతుండటం గమనార్హం. ఇకనైనా వ్యవసాయాధికారులు స్పందించి అధిక ధరలకు మిర్చి విత్తనాలను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ఆయా విత్తనాల షాపుల వద్ద స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కంపెనీ విత్తనాలకు పెరిగిన డిమాండ్...

మార్కెట్‌లో లభ్యమయ్యే ప్రముఖ కంపెనీల విత్తనాల ధరలు ఈసారి అమాంతం పెంచేశారని రైతులు చెబుతున్నారు. పొలంలో నేరుగా ఎదపెట్టే కేజీ విత్తనాల ధర రూ.700 ఉండగా, రైతులకు మాత్రం రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో ఉండే ఆయా విత్తన కంపెనీల మిర్చి విత్తనాలు మాత్రం రకాన్ని బట్టి కేజీ రూ.55వేల నుంచి రూ.95వేలు పలుకుతుండటం గమనార్హం. గత సీజన్‌లో అధిక దిగుబడులు సాధించిన విత్తన రకాలుగా ప్రచారం చేస్తూ రైతుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ముందుగా తీసుకోకపోతే నాణ్యమైన విత్తనం దొరకదనే ప్రచారాన్ని గ్రామాల్లో విస్తృతం సాగిస్తుండటంతో పలువురు రైతులు ఆందోళన చెందుతూ అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. అధికరేట్ల విషయంపై ప్రశ్నిస్తే, మీకు ఇష్టమైతే తీసుకోండి లేకపోతే లేదు అంటూ సదరు వ్యాపారులు గడసరి సమాధానాలు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు



మిరప విత్తనాలకు అధిక ధరలకు విక్రయించే షాపులు, వ్యక్తుల వివరాలను తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చే వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. విత్తనాలను కొనుగోలుకు సంబంధించిన రశీదు తీసుకోవడంతోపాటు పంట పూర్తయ్యేవరకు రైతులు భద్రపరుచుకోవాలి.

– జి సత్యనారాయణ, వత్సవాయి వ్యవసాయాధికారి

క్లుప్తంగా

నీతిఆయోగ్ బృందం సమీక్ష



పెనుగంచిప్రోలు: ఆస్పిరేషనల్ బ్లాక్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెనుగంచిప్రోలు బ్లాక్‌లో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ (ఆర్థిక చేరుదల)అమలుపై నీతి ఆయోగ్ బృందం సమీక్ష నిర్వహించింది. ఈసందర్భంగా ఎంపీడీఓ జి.శ్రీను మాట్లాడుతూ బ్లాక్‌లో ఆర్థిక చేరుదల చక్కగా అమలవుతోందని వివరించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ కోఆర్డినేటర్ మోహన్‌సందీప్ మాట్లాడుతూ ఆర్థిక చేరుదల అమలు విధానం , ప్రజలపై దాని ప్రభావం ఎలా ఉందనే విషయాలను బృంద సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో నీతిఅయోగ్ బృందం కోఆర్డినేటర్ మధుసూదనరావు, ఏపీఎం సుశీల, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ కె.రామసుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలతోపాటు తప్పనిసరిగా పంట నమోదు కూడా చేయించుకోవాలని కోరారు. లాభసాటి వ్యవసాయం కోసం రైతులు పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుని, సేంద్రీయ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఓ మీరా, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నరసింహునికి రూ. 17.57 లక్షల ఆదాయం



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారికి పలు రకాల వేలం పాటల ద్వారా రూ. 17.57 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం భూముల కౌలు, తలనీలాల వేలం పాటలు నిర్వహించారు. వేదాద్రి, బండిపాలెం గ్రామాల్లోని కౌలు భూములకు రూ.2.51 లక్షల ఆదాయం రాగా, తలనీలాలు పోగు చేసుకునే హక్కును బాపట్ల జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన కత్తుల యాదగిరి రూ. 15.06 లక్షలకు కైవసం చేసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని కాకానినగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఐదోవార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు కొలగాని రాము, షేక్ సిరాజున్ సత్తార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. అనంతరం నాడు-నేడు కార్యక్రమం కింద మంజూరైన ఆర్‌వో వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌ను స్కూల్‌కు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లికి వందనం కోరుతూ ధర్నా



తిరువూరు: తమ పిల్లలకు కూడా తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరుతూ తిరువూరు నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం చీరాల సెంటర్‌లో ధర్నా చేశారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసే తమకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నప్పటికీ తెలుపు రేషన్ కార్డు రద్దు చేయడం, సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సాధికార సర్వేలో తమను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం తగదని పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ యాగం


చండీ యాగం నిర్వహిస్తున్న అర్చకులు


ప్రత్యేక పూజల్లో అర్చకులు, భక్తులు

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న తుల్జా భవానీ అమ్మవారి ఐదో వార్షిక మహోత్సవాలలో భాగంగా చివరి రోజు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన అర్చకుడు ఉండి విశ్వతేజ చైతన్యశర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర కలశార్చన, పంచామృత సహిత ఫల రసాభిషేకం, చండీ హోమం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బాణావత్ బాలమ్మ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంతు సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్ సభ్యులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చపార్టీకి కీలుబొమ్మలుగా అధికారులు!

ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల: జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ మండలంలో పర్యటిస్తున్న సమచారాన్ని కూడా మండలస్థాయి అధికారులు తమకు తెలియజేయడం లేదని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి మండిపడ్డారు.

వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పచ్చపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న కంచికచర్ల మండలస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తాము కలెక్టర్ దృష్టికి సైతం తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. కంచికచర్లలో బుధవారం జరిగిన జిల్లాస్థాయిలో చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల రాయితీ నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమ సమాచారాన్ని ఎంపీడీవో, వ్యవసాయాధికారులెవ్వరూ తమకు తెలియజేయకపోవడం శోచనీయమన్నారు. ఈ తరహా ఘటనలను గతంలో జిల్లా పరిషత్ సమావేశం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సదరు అధికారుల తీరు మారకపోవడం తగదన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. జిల్లాస్థాయి అధికారుల పర్యటన, ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని తమకు తప్పకుండా తెలియజేయాలన్నారు. సమాచారం తెలియజేయని కంచికచర్ల మండలానికి చెందిన ఎంపీడీఓ, సంబంధిత అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ముక్త్యాల రోడ్డులో ప్రధాన పైపులైన్ లీకేజీ

తాగునీటి సరఫరాకు అంతరాయం


పైపులైన్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్డులో బుధవారం మంచినీటి పైపులైన్ లీకేజీకి గురికావడంతో రోడ్డంతా జలమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా పట్టణంలోని తాగునీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందిపడ్డారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణ ఆ ప్రాంతాన్ని పరిశీలించి మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందిచే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ లీకేజీ కారణంగా పట్టణంలోని మిట్టగూడెం, దంగుమిల్లు ప్రాంతం, యాదవబజారు, డీవీఆర్ నగర్ తదితర ప్రాంతాలకు ఒకరోజు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. లీకేజీని సరిచేసేందుకు మరమ్మతులు చేపట్టామని, 24 గంటల్లో సమస్య పరిష్కరించి యధావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

అత్యవసర నీటిసరఫరా కోసం ప్రజలు మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందికి సమాచారం అందిస్తే, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని వివరించారు.

వివాదానికి దారితీసిన మట్టి తోలకం

అధికారపార్టీ నాయకుల మధ్య వాగ్వాదం



బండిపాలెం(జగ్గయ్యపేట): చెరువు మట్టి తోలకం అంశం అధికార పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య వివాదానికి దారితీసిన ఘటన బుధవారం జగ్గయ్యపేట మండలంలోని బండిపాలెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పెనుగంచిప్రోలు మండలం కొణకంచి చెరువులోని మట్టిని మూడురోజులుగా జగ్గయ్యపేట మండలంలోని బండిపాలెం రైతుల పంట పొలాలకు ట్రాక్టర్ల ద్వారా తోలుతున్నారు. ఈ క్రమంలో చెరువు మట్టి తోలకంపై బుధవారం ఉదయం కొణకంచి గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు గ్రామాల నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనుమతులు లేకుండా మట్టి తోలుతున్నారంటూ కొణకంచి నాయకులు మట్టితోలకాన్ని నిలిపివేశారు. దీనిపై మునేటి జేఈ రామనరసింహారావును వివరణ కోరగా ఈనెల 20వతేదీ వరకు చెరువు మట్టిని రైతులు తోలుకునేందుకు అనుమతి ఉందని చెబుతుండగా, మట్టితోలకానికి అనుమతి లేదని పెనుగంచిప్రోలు మండల రెవెన్యూ అధికారులు పేర్కొంటుండటం గమనార్హం.

బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు రూ.లక్ష సాయం


బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు రూ.లక్ష సాయం అందచేస్తున్న ఎస్ఏబీసీఏ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విట్‌లో చదువుతున్న విద్యార్థిని బ్లడ్ క్యాన్సర్‌కు గురికాగా, ఆమె చికిత్స నిమిత్తం స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎస్ఏబీసీఏ) తరపున రూ. లక్ష ఆర్థిక సాయం అందచేశారు. ఈ మేరకు నగరంలోని కార్యాలయంలో యువతి బంధువుకు అసోసియేషన్ అధ్యక్షుడు పీపీ రాజు, అడ్వైయిజర్ కృష్ణారావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మండవ సాయి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందచేశారు.

యోగా ఓ జీవన విధానం


యోగా సాధన చేస్తున్న విద్యార్థులు


జగ్గయ్యపేటలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

నందిగామ రూరల్: యోగా సాధన ఓ క్రమబద్ధమైన జీవన విధానమని సిద్ధార్థ పాఠశాల డైరెక్టర్ పాములపాటి విజయలక్ష్మి మోహనరావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పాఠశాల ఆవరణలో బుధవారం యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సమతుల్యతను అభివృద్ధి చేయడంలో యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు యోగా సాధన చేస్తే ఏకాగ్రత పెరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు కొద్దిసేపు యోగా సాధన చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సీతారామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

నందిగామటౌన్: యోగా సాధనతో మెదడు పనితీరు మెరుగుపడటంతోపాటు ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవచ్చని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు యోగాపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. యోగా గురువు సీతారామారావు, నాయకులు బొడ్డు నాగలక్ష్మి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేటఅర్బన్: యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, ఇది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించే ఒక ప్రాచీన భారతీయ సాధన అని గిన్నిస్ రికార్డు విజేత, యోగా శిరోమణి సిరిపిరెడ్డి లీలావతి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విజ్ఞాన్ విద్యా సంస్థల్లో యోగా గురువు లీలావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవాత్మను పరమాత్మతో అనుసంధానించడమే యోగా అంతిమ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాల్వ్‌పిట్ గుంత


అడవిరావులపాడు సచివాలయం వద్ద ప్రమాదకరంగా దర్శనమిస్తున్న వాల్వ్‌పిట్ గుంత

నందిగామరూరల్:మండలంలోని అడవిరావులపాడు గ్రామ సచివాలయం ఎదుటనున్న వాల్వ్‌పిట్ గుంత ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. గుంతపై కనీసం రక్షణ మూత కూడా లేకపోవటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని ఆయా పనుల నిమిత్తం నిత్యం సచివాలయానికి పదుల సంఖ్యలో గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. సచివాలయం గోడ పక్కన రోడ్డు వెంబడి గుంత ఉండటంతో ప్రజలతోపాటు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రి సమయాలలో కనీసం గుంత కనిపించటం లేదని ఆదమరిస్తే అంతే సంగతులు అన్నట్లుగా పరిస్థితి ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. గుంతపై రక్షణ మూతలు ఏర్పాటు చేయాలని పలుమార్లు చెప్పిన సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహణ


కమ్మవారిపాలెంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

నందిగామరూరల్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో సాగుతోందని బీజేపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొడ్డు నాగలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపాలెంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 11ఏళ్ల బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించిందన్నారు. ముఖ్యంగా రక్షణ రంగంలో ప్రపంచంలోని అగ్రదేశాలతో పోటీ పడుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా మోడీ సర్కారు పని చేస్తోందని వివరించారు. 2047 నాటికి అగ్రరాజ్యంగా ఎదిగేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని, అందుకు ప్రతిఒక్కరు తమవంతు తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం ప్రజలతో కలిసి యోగాసనాలు వేయించి గ్రామ ప్రధాన వీధుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, నిడమానూరు రాఘవేంద్ర, కొంగర రమేష్, కామేశ్వరరావు, నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూరి జగన్నాథ రథయాత్రకు ప్రత్యేక బస్సులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఈ నెల 27న జరుగనున్న పూరి జగన్నాథ రథ యాత్రను పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై దానం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బస్సులు ఈ నెల 25న ఉదయం విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి అదే రోజు అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం ఆర్‌కే బీచ్ సందర్శన అనంతరం సాయంత్రం బయలుదేరి, కోణార్క్ సూర్య దేవాలయం చేరుకుంటుందన్నారు. అక్కడ కోణార్క్ దర్శనం, శ్రీపూరి జగన్నాథుని దర్శనం, రథయాత్ర పూర్తి చేసుకున్న అనంతరం తిరుగు ప్రయాణం చేసి 28న రాత్రి 7 గంటలకు విజయవాడ చేరుకుంటుందని చెప్పారు. ఈ యాత్రలో సూపర్ లగ్జరీ (హైటెక్), ఇంద్ర ఏసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. సూపర్ లగ్జరీకి ఒక్కొక్కరికి రూ. 3,600, ఇంద్ర ఏసీ బస్సులకు ఒక్కొక్కరికి రూ. 4,800 చార్జీ వసూలు చేస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు ఏపీఎస్ఆర్‌సీటీ వెబ్‌సైట్‌లో కానీ, సమీప బస్‌స్టేషన్‌లో కానీ, ఆర్టీసీ అధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద కానీ టిక్కెట్లు పొందవచ్చని తెలిపారు. ఈ యాత్రకు కనీసం 30 మంది సమూహంగా వెళ్లదలుచుకుంటే విజయవాడలోని వారి నివాస ప్రాంతం నుంచే బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర వివరాలకు సెల్: 80742 98487, 95158 60465 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మృతుని కుటుంబానికి తన్నీరు పరామర్శ

గౌరవరం(జగ్గయ్యపేట): మండలంలోని గౌరవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఉలవలపూడి బాబు(35) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. బాబు మృతదేహాన్ని ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, నాయకులు వట్టెం మనోహర్, అన్నా బత్తుల శ్రీనివాసరావు, బత్తుల రామారావు, మల్లేశ్వరరావు, జగదీష్ సందర్శించి నివాళులర్పించారు. మృతుడు బాబు కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాబు మృతదేహాన్ని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో తిరుపతమ్మకు గోల్డ్‌మెడల్



జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 15వతేదీ నుంచి రెండు రోజులపాటు విజయవాడలో జరిగిన జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జగ్గయ్యపేట పట్టణం చెరువుబజారు బంగారుపేటకు చెందిన ముద్ద తిరుపతమ్మ ఓపెన్‌కేటగిరి 63కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఈసందర్భంగా ముద్ద తిరుపతమ్మ బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను కలువగా ఆయన అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మైనేని రాధా, మల్లెల కొండయ్య, దేవరశెట్టి నాగరాజు, గాలం శ్రీను పాల్గొన్నారు.

విజయవాడ-విశాఖపట్నం ప్రయాణికులకు రాయితీ

బస్టాండ్(విజయవాడపశ్చిమ): విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే అమరావతి ఏసీ బస్సుల్లో ఈ నెల 26 నుంచి జూలై 24 వరకు టిక్కెట్ చార్జీలలో పది శాతం రాయితీ కల్పిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై దానం ఒక ప్రకటలో తెలిపారు. విజయవాడ-విశాఖపట్నం మధ్య సాధారణ చార్జీలు రూ. 1,070 ఉండగా పది శాతం రాయితీతో రూ. 970కే ప్రయాణించవచ్చన్నారు. ఈ చార్జీలు రాను, పోను టిక్కెట్లు ఒకేసారి రిజర్వు చేసుకునే ప్రయాణికులకు మాత్రమే వర్తిస్తుందని వివరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు సమ్మె కాలంలో ఇచ్చిన కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, ఫిట్టర్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు లేక వారి కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు, తుఫాన్‌లు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించినప్పటికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ తర్వాత వారు చేపట్టనున్న సమ్మెకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. ధర్నాలో ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..కొత్తపేట కోమల విలాస్ ప్రాంతానికి చెందిన బూర రామలక్ష్మికి 2017లో ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన కేసరికి నాగేశ్వరరెడ్డితో వివాహం జరిగింది. సెల్‌ఫోన్ షాపు నడిపే నాగేశ్వరరెడ్డికి మద్యం సేవించే అలవాటు ఉంది. కొంత కాలంగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను వేధింపులకు గురిచేయడమే కాకుండా వివాహేతర సంబంధాలు అంటకడుతుండటంతో ఆమె పుట్టింటికి చేరింది. ఈక్రమంలో భర్త వేధింపులపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.